ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం ఉష్ణోగ్రత ఖమ్మం: గరిష్ఠం 29 । కనిష్ఠం 18 | భద్రాద్రి: గరిష్ఠం 29 । కనిష్ఠం 18 ◆ సోమవారం, 1 జనవరి 2024

నేడు జిల్లాలో ఇద్దరు మంత్రుల పర్యటన

ఖమ్మం సంక్షేమవిభాగం, డిసెంబరు 31: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు వారి ఇరువురి క్యాంపు కార్యాలయాల నుంచి పర్యటన వివరాలను ఆదివారం వెల్లడించారు. మంత్రి పొంగులేటి ఉదయం 11.30 గంటల నుంచి మధ్నాహ్నం 3గంటల వరకు తన స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురంలో సాయంత్రం 4గంటల నుంచి ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో అందుబాటులోఉంటారు. అలాగే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉదయం 10:30గంట లకు ఖమ్మం నగర సమీపంలోని శ్రీసిటీలోని తన స్వగృహానికి చేరుకుంటారు.

నయా జోష్

- ఉత్సాహం నింపిన నూతన సంవత్సర వేడుకలు
- కేక్‌లు, మిఠాయిలు, బిర్యానీల కొనుగోళ్లతో సందడి
- వీధుల్లోకి వచ్చి కేరింతలు కొట్టిన యువత





ఖమ్మంలో న్యూఇయర్ వేడుకలు





ఇల్లెందులో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఖమ్మం సాంస్కృతికం, డిసెంబరు 31: నూతన సంవత్సర వేడుకలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో హోరెత్తాయి. అర్ధరాత్రి 12గంటలకు చిన్నాపెద్దా తేడా లేకుండా కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేరింతలు కొట్టారు. ఒకరి కొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఖమ్మం నగరంలో న్యూఇయర్ జోష్ మిన్నంటింది. చలిని సైతం లెక్క చేయకుండా యువతీయుకులు రోడ్లపై సబురాలు చేసుకున్నారు. హాస్టళ్లు, అపార్ట్‌మెంట్లు తదితర ప్రాంతాల్లో సామూహిక సంబురాలు నిర్వహించారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త ఏడాదిని స్వాగతిస్తూ యువత వీధుల్లో కదం తొక్కారు. బైక్ ర్యాలీలు నిర్వహించారు. కొత్త సంవత్సరం సందర్భంగా నగరంలో ప్రజలు విందు వినోదాలతో గడిపారు. ఈ సందర్భంగా రెస్టారెంట్లు కిటకిటలాడాయి. వినియోగదారులను ఆకట్టుకునేందుకు పలు రెస్టారెంట్లు ఆఫర్లు ప్రకటించాయి. ఉదయం నుంచే నూతన సంవత్సర ఏర్పాట్లలో జనం నిమగ్నమయ్యారు. వ్యాపార సంస్థలు సైతం విక్రయాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రెస్టారెంట్లు, స్వీట్లు దుకాణాల వారు వీధుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వినియోగదారులను ఆకట్టుకున్నారు. వీధుల్లోనే బిర్యానీ వంటకాలను తయారు చేశారు. మద్యం దుకాణాల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. పలు రెస్టారెంట్లు బిర్యానీల కొనుగోలుపై కూల్‌డ్రింక్, తదితర ఆఫర్లు ప్రకటించటంతో వినియోగదారులు బారులు తీరారు. న్యూ ఇయర్ కేక్‌లకోసం జనం స్వీటు షాపుల వద్ద బారులుదీరారు.

‘కొత్త’ ఆశలు నెరవేరేనా?

- వేగం అందుకోవాల్సిన ‘సీతారామ’ ప్రాజెక్టు పనులు
- నిధులకోసం ఎదురు చూస్తున్న జేఎన్‌టీయూ కాలేజీ
- పర్యాటక అభివృద్ధిపై కోటి ఆశలు

ఖమ్మం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కొత్త సంవత్సరంలో కొత్త ప్రభుత్వంపై ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో గతంలో ఎన్నడులేని విధంగా ఖమ్మం జిల్లాకు మూడు ప్రధానమైన పదవులు దక్కాయి. ముఖ్యమంత్రి రేంత్‌రెడ్డి కేబినెట్‌లో ఉపముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్కతో పాటు వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్థానం దక్కించుకోవడంతో ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల ప్రచారంలో ఈ ముగ్గురు నేతలతో పాటు కాంగ్రెస్ నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై అనేక హామీలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొత్త సంవత్సరం ఇరు జిల్లాలో అభివృద్ధి పరుగులు పెడుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 4లక్షలపైగా తెల్లకార్డులు ఉన్నందున ఆ మేరకు అభయహస్తం దరఖాస్తులు రాబోతున్నాయి. కాంగ్రెస్ ఇచ్చిన ఆరుగ్యారంటీలను అమలుచేసే బాధ్యత మంత్రులకు కీలకం కానుంది. ఇవే కాకుండా ఉమ్మడిజిల్లాలో ప్రధానంగా సీతారామ సాగునీటి ఎత్తిపోతల పథకం పనులు, సీతమ్మసాగర్ బ్యారేజీ పనులు నత్తడనకన సాగుతున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాల్సి ఉంది. సీతారామ ద్వారా గోదావరి జలాలను ఉమ్మడి జిల్లాలోని 10లక్షల ఎకరాలకు అందించాలంటే పాలేరు లింక్‌కెనాల్ పనులు కూడా వేగంగా చేపట్టాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం, మంత్రులు సమీక్ష నిర్వహించి నిధులు, విధులపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అలాగే ఉమ్మడిజిల్లాలో సాగునీటికి సంబంధించిన పలు ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. 300వరకు ఎత్తిపోతల



పథకాలు ఉన్నా అవి పనిచేయడంలేదు. వాటికి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. సాగర్ ఎడమకాలువ ఆధునికీకరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. అలాగే జిల్లాకు మంజూరైన పాలేరు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ తాత్కాలిక భవనాల్లోనే నడుస్తోంది. ఈ కాలేజీకి రెండో ఏడాదికి సుమారు 500మది విద్యార్థులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కాలేజీకి స్థలం కేటాయించి శాశ్వత భవనాలను నిర్మించాల్సిన అవసరం ఉంది. అలాగే జేఎన్‌టీయూను యూనివర్శిటీగా మార్పు చేసేందుకు మంత్రులు చొరవ చూపాల్సి ఉంది. అలాగే ఖమ్మానికి మంజూరైన మెడికల్ కాలేజీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇక ఎన్నో చారిత్ర ప్రదేశాలున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు. పాలేరు, ఖమ్మం, కిన్నెరసాని, వైరా, భద్రాచలం, తదితర ప్రదేశాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. భద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయంతోపాటు ఖమ్మంలో స్తంబాద్రి లక్ష్మినర్సింహాస్వామి ఆలయం, జమలాపురం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి ఆలయాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. 2024లో ఇందుకు అంకురార్పణ జరుగుతుందని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు. అలాగే భద్రాచలం అభివృద్ధికి ఆటంకంగా మారిన ఆంధ్రాలో విలీనమైన ఐదుపంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపే ప్రక్రియకు ఈ ఏడాది మంత్రులు చొరవ చూపాల్సి ఉంది. జిల్లాలో ఆర్అండ్‌బీ, పీఆర్, నేషనల్ హైవే రహదారులకు నిధులు కేటాయించి పనులు వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకుంటే రహదారుల అభివృద్ధిలో ఉమ్మడి ఖమ్మంజిల్లా రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా నిలిచే అవకాశం ఉంది. వ్యవసాయం ప్రధానంగా ఉన్న ఉమ్మడి జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమలు, ఫుడ్‌పార్కింగ్ జోన్లు ఏర్పాటుచేయాల్సి అవసరం ఉంది. ఇక ఖమ్మంలో ప్రభుత్వ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ దశాబ్దాన్నర కాలంగా ఉన్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ఈ ఏడాదైనా యూనివర్శిటీ ఏర్పాటుకు మంత్రులు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

లిక్కర్ కిక్

- గతేడాది మద్యం అమ్మకాలు రూ.2,700కోట్లు
- డిసెంబరులోనే అత్యధికంగా రూ.264కోట్ల వ్యాపారం





వైరా, డిసెంబరు 31: ఉమ్మడి ఖమ్మంజిల్లాలో 2023లో ఎంఆర్‌పీ రేట్ల ప్రకారం సుమారు రూ.2,700కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఇన్‌వాయిస్ రేట్ల ప్రకారం ఈ మద్యం విక్రయాలు రూ.2,277కోట్ల పైచిలుకుగా ఉంది. ఒక్క డిసెంబరులోనే అత్యధికంగా రూ.264కోట్ల మద్యాన్ని విక్రయించటం రికార్డుగా నిలిచింది. ఉమ్మడి జిల్లాలో 210మద్యం దుకాణాలు, 50బార్లు, మూడు క్లబ్‌లున్నాయి.

హ్యాపీ న్యూఇయర్



నూతన సంవత్సర వేడుకలను ఆంధ్రజ్యోతి ఖమ్మం యూనిట్ కార్యాలయంలో ఆదివారం రాత్రి ఘనంగా జరుపుకొన్నారు. 2023వ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, 2024 కొత్త ఏడాదిని ఆహ్వానిస్తూ బ్రాంచి మేనేజర్ తాళ్లూరి పుల్లారావు కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో బ్యూరో ఇన్‌చార్జ్ నలజాల వెంకటరావు, ఎడిటోరియల్, సర్క్యులేషన్, ఏడీవీటీ, టెక్నికల్ ఉద్యోగులు పాల్గొన్నారు.





తల్లాడలో రంగవల్లి తీర్చిదిద్దుతున్న ఓ మహిళ, ఖమ్మంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వేడుకల్లో మస్కట్‌కు యువతి కరచాలనం







ఖమ్మంలో నూతన సంవత్సర వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న యువత, ఖమ్మం నగరంలో రంగులు కొనుగోలు చేస్తున్న ప్రజలు, ఓ స్వీట్‌షాప్‌లో కిటకిటలాడుతన్న కొనుగోలుదారులు

నూతన సంవత్సరానికి ఇరు జిల్లాల ప్రజల ఘనస్వాగతం

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు 31: నూతన సంవత్సరానికి ఇరు జిల్లాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి కేరింతలు కొట్టారు. కేక్‌లు కట్ చేసి నూతన సంవత్సరానికి ఘనస్వాగం పలికారు. అతివలు తమ ఇళ్ల వాకిళ్లను శుభ్రం చేసి రంగవల్లులతో నూతన సంవత్సరానికి ఉత్సాహంగా స్వాగతం పలికారు. యువత కేరింతలు కొట్టి సంబురాలు జరుపుకున్నారు. నూతన సంవత్సరంలో ఉమ్మడి జిల్లా ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అంది స్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, సహకార సం స్థల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగు లేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం వారు వేర్వేరుగా పత్రికా ప్రకటనలు పంపారు. నూ తన సంవత్సరం సందర్భంగా ఇరు జిల్లాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం జిల్లా,నగర కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎండీ జావీద్‌లు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ లోకసభాపక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మేయర్ పునకోల్లు నీరజ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా సోమవారం తుమ్మల ఖమ్మంలోని శ్రీసిటీలోని స్వగృహంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. శాలువాలు, బొకేలు తీసుకురావద్దని కార్యకర్తలకు సూచించారు.

ఓబీ కంపెనీ కార్మికుడి ఆత్మహత్య

మణుగూరుటౌన్, డిసెంబరు 31: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని మల్లెపల్లి ప్రాంతంలోని ఓ కంపెనీలో పనిచేసే కార్మికుడు ఆదివారం కంపెనీ క్యాంపులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కార్మికుడి ఆత్మహత్యకు కుటుంబ కలహాలా.. లేదా ఓబీ కంపెనీ యాజమాన్యం ఒత్తిడి కారణామా అనే విషయం తెలియాల్సి ఉంది. ఇందుకు సంబంధించి తోటి కార్మికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన సునీల్‌దాస్(34) నాలుగు సంవత్సరాలుగా ఏరియాలోని ఓ ఓబీ కంపెనీలో వెల్డర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వారం క్రితం బీహార్‌లోని తన స్వగ్రామానికి వెళ్లి వచ్చిన అతడు.. విధుల్లో నిమగ్నమయ్యాడు. స్వగ్రామానికి వెళ్లి వచ్చిన సునీల్‌దాస్ అక్కడ కుటుంబంలోని కలహాలను దృష్టిలో ఉంచుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని తోటి కార్మికులు చెబుతుండగా.. కంపెనీలో యాజమాన్యం బయటకు తెలియకుండా పెట్టే ఒత్తిడి కూడా కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు. సునిల్ దాస్‌కు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ విషయమై ఓబీ కంపెనీ మేనేజర్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

కరకగూడెం, డిసెంబరు 31: మండలంలోని రఘునాథపాలెం పంచాయతీ నర్సంపేట కాలనీకి చెందిన దొడ్డి సూర్యం అనే వ్యక్తికి చెందిన పూరిల్లు శనివారం రాత్రి విద్యుదాఘాతంతో పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో వంట సామగ్రి, దుస్తులతో పాటు ఇంటి పరికారులు కూడా పూర్తిగా కాలి బూడిద అయ్యాయి. దాంతో సుమారు లక్ష రూపాయాల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అక్కడ చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు 25 కేజీల బియ్యం, దుస్తులను అందజేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించేల చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగబండి వెంకటేశ్వర్లు, ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

హెవీ వాటర్ ప్లాంట్‌కు సరఫరా చేసే బొగ్గు చోరీ

మణుగూరుటౌన్/అశ్వాపురం, డిసెంబర్ 31: సింగరేణి కాలరీస్ మణుగూరు రియాలోని కేసీహెచ్‌పీ నుంచి రోప్ వే ద్వారా సరఫరా చేసే బొగ్గు చోరీకి గురైంది. ఈ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. మణుగూరు ఏరియా కేసీహెచ్‌పీ నుంచి రోప్ వే ద్వారా టబ్బుల్లో హెడబ్ల్యూపీకి గత కొన్నేళ్లుగా బొగ్గు సరఫరా అవుతోంది. కాగా టబ్బుల్లో వెళ్లే బొగ్గును మణుగూరు రైల్వే స్టేషన్ ప్రాంతంలో, కళ్యాణపురం సమీపంలోని ప్రధాన రహదారి క్రాస్ అయ్యే ప్రాంతంల్లో టబ్బుల నుంచి బొగ్గు చోరీకి గురవుతోందని కొన్నేళ్ల నుంచే ప్రచారం సాగుతోన్న అటు హెచ్‌డబ్ల్యూపీ, ఇటు సింగరేణి అధికారులు దృష్టి సారించిన సంఘటనలు లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా చోరీ చేసిన బొగ్గును అశ్వాపురం మండలంలోని ఇటుక బట్టీలకు టన్నుల కొద్దీ అక్రమంగా రవాణా జరుగుతోందన్న ప్రచారం గతంనుంచే ఉంది. కాగా ఇటీవల ఈ బొగ్గు చోరీ అధికమొత్తంలో జరుగుతోందన్న విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు రోప్ వే ద్వారా చోరీ చేసిన బొగ్గు ఆదివారం అశ్వాపురం మండలం జగ్గారం సమీపంలోని శ్మశాన వాటిక సమీపంలో పెద్దఎత్తున బొగ్గు నిల్వలు లభ్యమయ్యాయి. పోలీసులు చోరీకి పాల్పడుతోన్న ట్రాక్టర్‌లను, చోరికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.


చికిత్స పొందుతూ యువకుడి మృతి

పినపాక, డిసెంబర్ 31: మండలంలోని గడ్డంపల్లి గ్రామానికి చెందిన సోలం రాజేష్ (22)అనే యువకుడు 20 రోజుల క్రితం అనారోగ్య కారణాలతో కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వైద్య చికిత్స నిమిత్తం భద్రాచలం, ఖమ్మం ఆసుపత్రులకు తరలించారు. ఆరోగ్యం మెరు గుపడకపోవడంతో హైదరాబాద్ తరలించారు. అక్కడ గత 20 రోజులుగా వైద్య చికిత్స పొందుతూ, ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. రాజేష్ మృతితో గ్రామంలో విషాదఛా యలు అలము కున్నాయి. మృతుడు రాజేష్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏడూళ్లబయ్యారం ఎస్ఐ నాగుల్ మీరాఖాన్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి యత్నం

వైరా, డిసెంబరు 31: వైరా మునిసిపాలిటీ తొమ్మిదోవార్డు లీలాసుందరయ్యనగర్‌లోని ఓ ఇంట్లో శనివారం రాత్రి చోరీ ప్రయత్నం జరిగింది. తాళాలు వేసి ఉన్న ఇంటి తలుపులను గడ్డపలుగులతో పగులగొట్టారు. ఇంటి యజమాని నల్లమోతు సత్యనారాయణ కొద్దినెలల కిందట కుటుంబసభ్యులతో అమెరికా వెళ్లారు. ఇదే అదునుగా భావించిన అగంతకులు గడ్డపలుగులతో ఇంటిముందు తలుపు తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. ఇంటిలోపల బెడ్‌రూంలో ఉన్న బీరువాలు సైతం పగులగొట్టి వస్తువులను చిందరవందర చేశారు. ఆఇంటి పక్కనే ఉన్న వారు ఆదివారం ఉదయం సత్యనారాయణ ఇంట్లో లైట్లు వెలుగుతుండటంతో అనుమానం వచ్చి పరిశీలించగా తలుపు తాళాలు పగులగొట్టి కన్పించాయి. ఆవెంటనే ఇంటియజమానికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. సత్యనారాయణ బంధువులు వైరా వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మేడా ప్రసాద్ సంఘటనాస్థలాన్ని సందర్శించి పరిశీలించారు. క్లూస్‌టీం వైరా చేరుకొని వేలిముద్రలు సేకరించారు.

కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి

రఘునాథపాలెం, డిసెంబరు 31: ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారులపై కుక్కలు దాడి చేయటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిలో ఓ చి న్నారి తీవ్రంగా గాయపడింది. ఈసంఘటన ఆదివారం రఘునాథపాలెం మండలంలో చోటు చేసుకొంది. స్థానికుల కథనం మేరకు వీ వెంకటా యపాలెం గ్రామంలోని జగ్యతండాకు చెందిన బానోత్ వైష్ణవ్‌తేజ్, బానోత్ సూర్య తోటి పిల్లలతో కలిసి ఆదివారం వారి ఇంటి సమీపంలో ఉదయం ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రాంతానికి చేరుకున్న కుక్కల గుంపు ఒక్కసారిగా ఆ పిల్లలపై పడి దాడి చేశాయి. బాణోత్ వైష్ణవ్‌తేజ్ బుగ్గపైన, కంటి రెప్పలు, తలపై కుక్కలు తీవ్రంగా కరిచాయి. మరో బాలుడు బానోత్ సూర్య కడుపుపైన కుక్కలు దాడి చేశాయి. కుక్కల దాడిని గమనించిన తల్లిదండ్రులు వెంటనే గాయాలైన పిల్లల్ని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సూర్య వైద్యసేవలు అనంతరం ఇంటికి రాగా బాణోత్ వైష్ణవ్‌తేజ్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మాతాశిశు విభాగంలో వైద్యసేవలు పొందుతున్నారు. జిల్లా వైద్యాధికారి మాలతి, మంచుకొండ ప్రాథమిక వైద్యాధికారి బాలకృష్ణ వైద్యశాలకు వెళ్లి వైష్ణవ్‌తేజ్‌కు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

దట్టమైన అటవీ ప్రాంతంలో జూదం

- సత్తుపల్లి మండలంలో యథేచ్ఛగా పేకాట!?
- విషయం తెలిసి జిల్లా మంత్రి ఆగ్రహం
- మూటాముల్లే సర్దుకుని వెళ్లిన నిర్వాహకులు
- క్రిమినల్ కేసులు నమోదు చేస్తామంటున్న పోలీసులు

సత్తుపల్లి, డిసెంబరు 31: సరదాగా మొదలై.. ఆ తర్వాత బానిసై జేబులు గుల్లచేసే పేకాట, జూదం మనకు అవసరమా.. మనది కానీ సంస్కృతిపై మనకెందుకు ఆసక్తి అంటూ జిల్లాకు చెందిన ఓ మంత్రి మొట్టికాయలు వేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. వారం రోజులుగా సత్తుపల్లి మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతాలను ఆ సరాగా చేసుకున్న కొందరు పేకాట నిర్వాహకులు స్థావరాలను ఏర్పాటుచేసి, జూదరు లను ఆహ్వానించి ఎంచక్కా ఆట ఆడిస్తున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎన్నికల కు ముందు రహస్య ప్రదేశాలు, నిర్మానుష్య ప్రాంతాల్లోని ఇళ్లే పేకాట ఆడేందుకు అడ్డాలుగా మార్చిన నిర్వాహకులు అమాయలకు జేబులను గుల్లచేయగా, కొందరిని లక్షాధికారులను కూడా చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. సరిహద్దు జిల్లాల్లో ఈ సంస్కృతి, ఇప్పుడు సత్తుపల్లి పరిసర ప్రాంతాలలో సైతం వ్యాపించింది. పేకాట నిర్వాహకులు ఇతర జిల్లాల్లోని జూదరులకు సమాచారం పంపి ఎక్కడ ఏ రోజున ఆట నిర్వహించేది సమాచారం అందిస్తున్నారని తెలిసింది. ఈ సమాచారంతో నిర్ణీత ప్రదేశానికి చేరుకున్న పేకాటరాయుళ్లకు అన్ని సౌకర్యాలను నిర్వాహకులు భారీస్థాయిలో ఏర్పాటు చేస్తున్నారు. జూదరులు ఎటువంటి ఇబ్బందులు కలగవని నమ్మించి నిర్వాహకులు పేకాట స్థావరాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇదే క్రమంలో కొద్దిరోజులుగా సత్తుపల్లి మండలంలో పెద్ద ఎత్తున కొందరు రాజకీయ నాయకుల అండదండలతో పేకాటను నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రెండ్రోజుల క్రితం బంద్

సత్తుపల్లి మండలంలోని కిష్టారం-చెరుకుపల్లి మధ్యలో దట్టమైన అటవీ ప్రాం తాల్లో ఇలా పేకాట ఆడుతున్నట్లుగా ప్రచారం జరగడంతో జిల్లాకు చెందిన ఒక మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం మంత్రి ఆగ్రహం వ్యక్తం చేయడంతో పేకాట నిర్వాహకులు మూటాముల్లే సర్దుకుని పోయినట్లు తెలిసింది. కొద్దిరోజుల్లో సంక్రాంతి పండుగ రానుండటంతో ఆంధ్రా సరిహద్దుల్లో ఉన్న సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో పేకాట, కోడిపందేల నిర్వహణ జరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు అంటున్నారు. వీటిని అదుపు చేసేందుకు పోలీసులు నిఘా పెంచాల్సిన అవసరం ఉంది.



క్రిమినల్ కేసులు నమోదుచేస్తాం
బీ.రామానుజం, కల్లూరు ఏసీపీ

సత్తుపల్లి మండలంలో పేకాటాడుతున్నట్లుగా సమచారం తమకు అందలేదని కల్లూరు ఏసీపీ బీ.రామానుజం అన్నారు. పేకాటరాయుళ్లపై ప్రత్యేక దృష్టిపెట్టాం. ఎక్కడ ఎలాంటి సంఘ వ్యతిరేక కార్యక్రమాలు జరిగినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పేకాట, కోడిపందేల సమాచారాన్ని డయల్ 100ద్వారా తమకు సమాచారం ఇస్తే చర్యలలో భాగంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. పేకాట, జూదం, కోడిపందేలకు ఎక్కడా అనుమతులు లేవని, ఈ సందర్భంలో ప్రతిచోటా నిఘా వ్యవస్థను పటిష్ఠం చేశామని చెప్పారు.

అక్రమ క్రమబద్ధీకరణ స్థలాల పరిశీలన

ఖమ్మం, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో జీవో నెంబరు 59 పేరుతో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆదివారం నగరంలోని పలు క్రమబద్ధీకరణ జరిగిన పలు స్థలాలను కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం రెవెన్యూ పరిధిలో గత ప్రభుత్వం హయాంలో కొందరు బీఆర్ఎస్ నేతలకు అక్రమంగా క్రమబద్ధీకరణ చేశారనీ వారు ఆరోపించారు. ఆయా స్థలాలకు చెందిన క్రమబద్ధీకరణ వ్యవహారాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు వాటిపై విచారణ చేయించి రద్దు చేయిస్తామన్నారు. స్థలాలను పరిశీలించినవారిలో తుంబూరు దయాకర్ రెడ్డి, కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల, దుద్దుకూరి వెంకటేశ్వరు, చావా నారాయణరావు, కమర్తపు మురళి, ఎండీ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



అక్రమంగా క్రమబద్ధీకరించిన స్థలాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఐరన్ షాపులో చోరీ

మధిర రూరల్, డిసెంబరు 31: మధిర మండలం సిరిపురం గ్రామంలో మెయిన్ రోడ్డులోగల ఓ ఐరన్ షాపులో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు చోరీకి పాల్పడ్డారు. షాపు యజమాని షేక్.రహీం తెలిపిన ప్రకారం వివరా లిలా ఉన్నాయి. సిరిపురం గ్రామసమీపంలోని పెట్రోల్ బంకు పక్కన బిస్మిల్లా ఐరన్ షాపు తాళాలను గుర్తుతెలియని దొంగలు అర్ధరాత్రి దాటిన తర్వాత పగులగొట్టారు. షాపులో ఉన్న రూ.10600నగదుతోపాటు, పలు ఐరన్ వస్తువులను అపహరిం చుకుపోయారు. ఆదివారం ఉదయం షాపు తీయడానికి వెళ్లిన యజమాని రహీం తాళాలు పగుల గొట్టి ఉండటం చూసి చోరీ జరిగినట్లు గుర్తించాడు. రూరల్ పోలీసు లకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి ఘటనాస్థలాన్ని పరిశీలిం చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కళాకారుల వనసమారాధన



వనసమారాధనలో మాట్లాడుతున్న కొండబాల కోటేశ్వరరావు

మధిర రూరల్, డిసెంబరు 31: మధిర మండలం ఆత్కూరు మామి డితోటలో సీతారామాంజనేయస్వామి కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లాస్థాయి వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాపరిషత్ అధ్యక్షుడు గడ్డం సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రెండుజిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కళాకారులు ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి సంవత్సరం మధిరలో కళాపరిషత్ అధ్యక్షుడు గడ్డం సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమన్నారు. మధిర ప్రాంతం కళాకారులకు పుట్టినిల్లు అన్నారు. మధిర కళాకారులు పలు నాటకాలు వేసి జిల్లా, రాష్ట్రస్థాయిల్లో పెద్ద ఎత్తున బహుమతులు గెల్చుకున్నారని గుర్తుచేశారు. కళాకారులంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం కళాకారుల నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, అధ్యక్షుడు గడ్డం సుబ్బారావు, కళాకారులు గడ్డం లాలయ్య, బాబ్లా, రిటైర్డ్ ఉపాధ్యాయుడు పారుపల్లి సురేష్, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సైనికుడు మృతి

మమత కళాశాలకు భౌతిక కాయాన్ని అప్పగించిన కుటుంబ సభ్యులు



వెంకటయ్య(ఫైల్)

ఖమ్మం రూరల్, డిసెంబర్ 31: మండల పరిధిలోని తల్లంపాడు గ్రామానికి చెందిన మాజీ సైనికుడు దున్న వెంకటయ్య (77) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. వెంకటయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వెంకటయ్య 1962లో జరిగిన భారత్, చైనా యుద్ధంలో పాల్గొన్నారు. దాంతో భారత ప్రభుత్వం వెంకటయ్యను సంగ్రామ్ మెడల్‌తో సత్కరించింది. ఉద్యోగ విరమణ అనంతరం వెంకటయ్య గోదావరిఖనిలోని సింగరేణిలో వాచ్‌మెన్‌గా సుమారు 10 సంవత్సరాలు పనిచేశారు. కొంతకాలంగా వెంకటయ్య అనారోగ్యంతో బాధపడుతు న్నారు. వెంకటయ్య భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు ఖమ్మం లోని మమతా మెడికల్ కళాశాలకు అప్పగించారు. కాగా, ఆయన మృతదేహన్ని వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు సందర్శించి నివాళుర్పించారు.



వెంకటయ్య భౌతిక కాయం

అన్నిగ్రామాలలో వికసిత్ సంకల్ప్

ఖమ్మంబైపాస్‌రోడ్, డిసెంబరు31: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో నిర్వహిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తెలిపారు. ఈసందర్భంగా ఈసంకల్పయాత్ర ఏర్పాట్లపై ఆదివారం జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ అట్లూరి శ్రీనివాసరెడ్డిని బీజేపీ నాయకులు కలిసి చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్‌రాథోడ్, జిల్లా అధికారప్రతినిధి విజయారెడ్డి, జిల్లా ఉపాధ్య క్షురాలు మంద సరస్వతి, విష్ణుకాంత్, ఉపేందర్‌రెడ్డి, దీకొండ శ్యామ్, శ్రీకాంత్‌నాయక్ పాల్గొన్నారు.



మొక్కపోచమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

వైభవంగా మొక్కపోచమ్మ వేడుకలు

తల్లాడ, డిసెంబరు 31: తల్లాడ మండలం అన్నారుగూడెం కాటన్‌పార్కు ప్రాంగణంలో వెలిసిన మొక్కపోచమ్మ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. మండలంలోని నర్సింహారావుపేట గ్రామంలోని ప్రతి ఇంటినుంచి మహిళలు బోనాలతో ట్రాక్టర్‌పై ప్రభను కట్టి మేళతాళాలతో ఊరేగింపుగా మొక్కపోచమ్మ దేవాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, సారెలను సమర్పించారు. అర్చకులు అనిపెద్ది సుబ్రహ్మణ్యశర్మ ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలకు పరిసర గ్రామాల నుంచి వందలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతూ ఉపాధ్యాయుడి మృతి



హనుమంత రావు (ఫైల్)

పెనుబల్లి, డిసెంబరు 31: మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈసంఘటన పెనుబల్లిలో ఆదివారం జరిగింది. పెనుబల్లి హెచ్‌డబ్ల్యూ పాఠశాలలో ఉపాధ్యాయు డిగా పని చేస్తున్న రామగిరి హనుమంత రావు(53) కొంతకాలంగా మూ త్రపిండాల సమస్యతో బాధపడున్నాడు. ఖమ్మంలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు.

కారు, బైక్ ఢీ: నలుగురికి గాయాలు

కొణిజర్ల, డిసెంబరు 31: మండల పరిధిలోని పల్లిపాడు సమీపంలో ఆదివారం రాత్రి కారు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ద్విచక్రవాహనం పై ఉన్న నలుగురుకి తీవ్రగాయలు అయ్యాయి. ఎస్ఐ శంకర్‌రావు, స్థానికుల కథనం ప్రకారం రఘునాథపాలెం మండలం పాండురంగాపురానికి చెందిన సంతోష్, లక్ష్మణ్, కార్తీక్, రియాజ్ నలుగురు ఒకే ద్విచక్రవాహనం పై వైరా వైపు నుంచి పాండురంగాపురం వస్తుండగా పల్లిపాడు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం పై ఉన్న నలుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 ద్వారా ఖమ్మం తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వారిని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. ఎస్ శంకర్‌రావు సిబ్బందితో అక్కడకు చేరుకొని క్షతగాత్రుల వివరాలను తెలుసుకుంటున్నారు.



పల్లిపాడు రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు, గాయపడిన యువకుడు

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్మికుడు మృతి

కల్లూరు, డిసెంబరు 31: కల్లూరులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ పంచాయితీ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. స్థానికంగా పంచాయితీ ప్రాంగణంలో గల మరుగుదొడ్ల వద్ద పారిశుధ్య కార్మికుడిగా ఎనిమిది సంవత్సరాల క్రితం నుంచి కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్నాడు. ప్రధాన రహదారిపై ద్విచ్రవాహనంపై రాత్రి 8 గంటల సమయంలో కుందన్ కుమార్ (35) పంచాయతీ కార్యాలయానికి వస్తుండగా సత్తుపల్లి వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొనటంతో కుమార్ అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటుగా ఇద్దరు పిలల్లు ఉన్నారని తెలిసింది. కాగా బీహార్ రాష్ట్రం నుంచి పొట్ట కూటి కోసం కల్లూరు వచ్చిన కుందన్‌కుమార్‌కు అతని వ్యక్తిత్వంపై సంతృప్తి చెందిన పంచాయతీ పాలక వర్గం కాంట్రాక్టు కార్మికుడిగా ఉపాధి కల్పించింది. కుందన్ కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో నూతన సంవత్సర వేడకలకు విషాదచాయలు అలుముకున్నాయి. కల్లూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సమాచారం సేకరించారు. కేసు నమోదు కావాల్సి ఉంది.

భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ భార్య మృతి

ఖమ్మం క్రైం, డిసెంబరు 31: కుటుంబ కలహాలతో పురుగుమందు తాగి భార్యా భర్తలు ఆత్మహత్యకు యత్నించారు. ఈ సంఘటనలో భార్య మృతి చెందింది ఈ ఘటన ఆదివారం ఖమ్మం నగరంలో జరిగింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నిజాంపేటకు చెందిన భార్యాభర్తలు కుమ్మరి కస్తూరి (53), భర్త వెంకటేశ్వర్లు కుటుంబ కలహాలతో ఈ నెల 26న పురుగుమందు తాగారు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు వారిని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొం దుతూ కస్తూరి ఆదివారం మృతి చెందింది. వెంకటేశ్వర్లు ఆరోగ్యం నిలకడగానే ఉంది. ఈ ఘటనపై కుమారుడు చరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, కస్తూరి మృతి చెందడం, వెంకటేశ్వర్లు ఆసుపత్రిలో ఉండటంతో ఆ కుటుంబంలో విషాద చాయలు అలముకున్నాయి.

బాల్యానికి అండగా.. ఆపరేషన్ స్మైల్

- నేటి నుంచి నెల రోజుల పాటు 10వ విడత కార్యక్రమం
- పలు శాఖలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహణ



ఖమ్మం ఖానాపురం హవేలీ, డిసెంబరు 31: బాలలకు అండగా ఆపరేషన్ స్మైల్ నిలుస్తోంది. చిన్నతనంలోనే వివిధ రకాల పనులు చేసుకుంటూ జీవిస్తున్న బాలలను గుర్తించి, వారి భవిష్యత్‌ను తీర్చిదిద్ది, వారిని ఉత్తమ విద్యావంతులుగా, పౌరులుగా తయారు చేసేందుకు ఈ కార్యక్రమానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ముందడుగు వేస్తున్నాయి. ఏటా జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు నెల రోజుల పాటు పోలీసు శాఖ, మహిళలు, బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయా శాఖల్లోని ఎనిమిది మంది సభ్యులతో బృందంగా ఏర్పడి రాష్ట్ర వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో జనవరి 1వ తేదీ నుంచి 10వ విడత ఆపరేషన్ స్మైల్ చేపడుతున్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తారు. వాటిలో ఒక ఎస్సై, నలుగురు పీసీలు, బాలల పరిరక్షణ సిబ్బంది, సహాయక కార్మిక అధికారి, రెవెన్యూ ఆర్ఐ, చెల్డ్ లైన్ సిబ్బంది ఉంటారు.

ఆపరేషన్ స్మైల్ అంటే..

తల్లిదండ్రులు చనిపోయి కొందరు, ఇంటి నుంచి పారి పోయి వచ్చిన మరికొందరు పూటగడవక బాల కార్మికులుగా జీవితాన్ని గడుపుతుంటారు. ఇలాంటి వారిని గుర్తించేందుకు ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఆపరేషన్ స్మైల్ చేపడుతోంది. కమిటీ సభ్యులు తప్పిపోయిన పిల్లల వివరాలు సేకరించి ఒక నివేదిక రూపొందిస్తారు. ఈ వివరాలతో జిల్లాలోని పలు శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, జనరద్దీ కలిగిన ప్రాంతాల్లో, పని చేసే ప్రదేశాల్లో తనిఖీలు చేపడుతారు. వీధి బాలలు, బాల కార్మికులు, అక్రమ దత్తత పొందిన పిల్లలు, భిక్షాటన చేస్తున్న పిల్లలు కనిపిస్తే వారిని తీసుకెళ్లి వారి చిరునామా తెలుసుకొని తల్లిదండ్రులకు అప్పగిస్తారు.నిరాశ్రయులైన పిల్లలు ఉంటే స్వచ్ఛంద సంస్థలు లేదా ప్రభుత్వ బాల సదనాల్లో ఆశ్రయం కల్పించి, వారికి భవిష్యత్ అందిస్తారు.

ప్రారంభం కానున్న తనిఖీలు

జిల్లాలో వీధి బాలలు, బాల కార్మికులను గుర్తించి వారికి బంగారు భవిష్యత్ ఇవ్వాలనే లక్ష్యంతో 2015 నుంచి పోలీసు, శిశు, సంక్షేమ, కార్మిక, విద్య, వైద్య, రెవెన్యూ శాఖలతో పాటు జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా ఏర్పడి ప్రతి ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్‌ను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. వివిధ శాఖల నుంచి ఎనిమిది మంది అధికారులతో బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తారు. తప్పిపోయిన పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు అప్పగిస్తారు. అనాథ పిల్లలను ప్రభుత్వ, ప్రభుత్వేతర బాలల సదనాల్లో ఆశ్రయం కల్పిస్తారు. భిక్షాటన చేస్తున్న బాలలు, అక్రమ రవాణాకు గురైన పిల్లలను గుర్తించి బాలల సంక్షేమ సమితి ఎదుట హాజరు పరిచి నిరాశ్రయులైన పిల్లలకు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ బాల సదనాల్లో ఆశ్రయం కల్పిస్తారు.

రైతుబంధు డబ్బులను వెంటనే విడుదల చేయాలి

- పోతినేని డిమాండ్



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

వైరా, డిసెంబరు 31: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుబంధు డబ్బులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత సమావేశంలో సుదర్శన్‌రావు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఎలాంటి జాప్యం లేకుండా రైతుబంధు డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. తెగుళ్ల వలన నష్టపోయిన మిర్చిరైతులకు పరిహారం చెల్లించాలని, యాసంగిలో ఆరుతడి పంటలకు సాగర్‌జలాలు విడుదల చేయాలని కోరారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు రాయల వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ప్రసాద్, చింతనిప్పు చలపతిరావు, సహాయ కార్యదర్శులు షేక్.మీరా, శీలం పకీరమ్మ, గోడవర్తి నాగేశ్వరరావు, బిక్కసాని గంగాధర్, రచ్చా నర్సింహారావు, మాజీ ఎంపీపీలు బొంతు సమత, రమేష్ అలాగే మల్లెంపాటి రామారావు, వనమా చిన్నసత్యనారాయణ, కిలారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల కృషితో..

రూ.1.5లక్షల ఎల్ఓసీ లేఖ అందజేత

ఖమ్మం సంక్షేమవిభాగం, డిసెంబరు 31: ఖమ్మం నగరానికి చెందిన ఓ బాలుడు అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆ బాలునికి వైద్యసేవల నిమిత్తం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో తుమ్మల యుగంధర్ రూ.1.5లక్షల ఎల్‌వోసీ లేఖను అందజేశారు. ఖమ్మం నగరంలోని ఖిల్లాకు చెందిన మహ్మద్ అబ్దుల్ మాలిక్ కుమారుడు మహ్మద్ ఖుద్దూస్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు సమస్యను తుమ్మల యుగేందర్‌కు తెలియజేశారు. దీంతో స్పందించిన యుగేందర్ వైద్యసేవల కోసం రూ.1.5లక్షల ఎల్‌వోసీ లేఖను కొన్న గంటలలోపే ఇప్పించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు.

ఉపకార వేతనాల దరఖాస్తు గడువు పెంపు

ఖమ్మం సంక్షేమవిభాగం, డిసెంబరు 31: సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని నిర్వహించే పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి నూతన, రెన్యూవల్స్ దరఖాస్తుల తుది గడువును ప్రభుత్వం పెంచిందని సాంఘిక సంక్షేమశాఖ డీడీ కస్తాల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 31.1.2024వరకు గడువును పొడిగించటం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులు ఈ- పాస్ వెబ్‌సైట్‌లో గడువుకు ముందుగా దరఖాస్తులను సమర్పించాలని డీడీ కస్తాల సత్యనారాయణ కోరారు.

ఘనంగా పుస్తక ఆవిష్కరణ



పుస్తక ఆవిష్కరణ దృశ్యం

ఖమ్మం సాంస్కృతికం, డిసెంబరు 31: ప్రముఖ కవయిత్రి ఫణిమాధవి కన్నోజు రచించిన సామభేద కవితా సంపుటి ఆవిష్కరణ ఆదివారం ఖమ్మంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ప్రముఖ కవి నగ్నముని ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆకెళ్ల రాఘవేంద్రకు పుస్తకాన్ని అంకితమిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్, ప్రముఖ సాహిత్యవేత్త మువ్వా శ్రీనివాసరావు, ప్రముఖ కవి యాకూబ్, తెలంగాణ సాహితి రాష్ట్ర కార్యదర్శి కె. ఆనందచారి, సీనియర్ కవయిత్రి ఉరిమళ్ల సునంద, సిద్దిపేట సెషన్స్ కోర్టు జడ్జ్ కన్నోజు మురళీమోహన్, నీలిమ వీఎస్ రావు, జయశ్రీమువ్వా, తోట సుభాషిణి తదితరులు పాల్గొన్నారు. కవితా సంపుటి తొలి ప్రతిని యు భాస్కర్‌కు అందజేశారు.

మనో ఫలకాల ప్రతిబింబం

జ్ఞాపకాల పొదరిల్లు

- నూతన సంవత్సర ప్రియనేస్తం డైరీ



ఇల్లెందు, డిసెంబరు 31: మన నిత్య జీవితంలోని సంఘటనలు, అందమైన అనుభూతులు, మధురమైన జ్ఞాపకాలు పదిలపరుచుకునే ప్రతిరూపం డైరీ. మనిషిలోని అంతర్లీన భావాలను పంచుకునే ఒక రైటింగ్ డాక్యుమెంట్‌గా డైరీని భావించవచ్చు. నూతన సంవత్సరం ప్రారంభమైందంటే అందరి మనుస్సు అందమైన డైరీలపైనే ఉంటుంది. హస్తభూషణంగా మనోభావాలు నిక్షిప్తం చేసే రాతప్రతిగా భావించే డైరీ రాయడం, నిర్వహించడం ఒక ప్రత్యేకమైన కళ. ఆధునిక కాలంలో డిజిటల్ డైరీలు సైతం పెద్ద ఎత్తున వినియోగంలోకి వచ్చినప్పటికి రాతప్రతులతో కూడిన డైరీలకు ప్రాధాన్యం తగ్గలేదు. రహస్యాలు పదిలంగా ఉంచుకునే సౌలభ్యం డిజిటల్ డైరీలో ఉన్నప్పటికి వ్యక్తిత్వ మనోవికాసానికి దోహదపడే సంప్రదాయ డైరీ స్థానం మాత్రం చెదరలేదు. కంప్యూటర్ల పరిజ్ఞాం ఉన్నవారు ఎక్కువగా డిజిటిల్ డైరీ వైపు మొగ్గు చూపుతున్నప్పటికి చేతిరాత డైరీ పట్ల ఆదరణ పెరుగుతుండటం గమనార్హం.

వ్యక్తిత్వ వికాసం పెరుగుదల..

మధుర భావనలు విశ్లేషించడానికి అనుభావల సారంతో జీవన గమ్యాలను నిర్దేశించుకోవడానికి స్వేచ్ఛగా భావాలను అక్షరనిక్షిప్తం చేసే ఏకైక సాధనం డైరీ. డైరీ రాసే అలవాటు ఉన్న వారిలో మంచి రచణ నైపుణ్యంతో పాటు అంతర్లీన వ్యక్తిత్వాన్ని వ్యక్తపరిచే భావావేశం ఉంటుంది. డైరీ రాయడంలో ప్రత్యేకత ఏమిటంటే దశాబ్దాలు గడిచినా తరాలు మారినా తిరిగి వాటిని చదువుకునే అవకాశం, జ్ఞాపకాలు అనుభూతులు ఆస్వాదించే అవకాశం ఉంటాయి. భావ ప్రకటన స్వేచ్ఛతో పాటు రచణ నైపుణ్యాలు మెరుగు పరుచుకోవడానికి అవకాశముంటుంది. అంతేకాదు. డైరీలో రాసే ప్రతి అంశం మన ఆలోచనల్లో నిజాయితీని మరిచిపోకుడదనే విషయాలు పంచుకునేందుకు సురక్షితమైన స్థలంగా భావిస్తుంటారు. సృజనాత్మకతతో కూడిన అంశాలు బావ వ్యక్తీకరణలు డైరీ ద్వారా మనో వికాసాన్ని కలగజేస్తాయని బావిస్తుంటారు.

● డైరీ రాయడం అనేక రకాలు..

నవీన కాలంలో అనేక మంది వివిధ రకాల అంశాలు గుర్తుంచుకోవడానికి డైరీల్లో రాసుకోవడం తెలిసిందే. పాఠశాలల డైరీల్లో విద్యాసంబంధ వివరాలు, విద్యార్థుల పురోగతి, మార్కులు, బోధనాంశాలు ఇతర కార్యకలాపాలు నమోదు చేస్తుంటారు. మెడికల్ డైరీలు రాసే వారు వ్యక్తిగత ఆరోగ్యసంబంధ అంశాలు, వినియోగించే ఓషదాలు, వైద్య పరీక్షల సమచారాలు, కుటుంబ వైద్యుల వివరాలు, ఫిట్‌నెస్‌ల గురించి రాయడం కనిపిస్తుంది. ట్రావెల్ డైరీల్లో ఆహ్లాదకర ప్రదేశాల సందర్శనలు ప్రయాణాల అనుభవాలు, బంధువులు, స్నేహితులతో గడిపిన సన్నివేశాల గురించి, ఉద్యోగులు తాము నిర్వహించాల్సిన పనులు, విధులు, అపాయింట్‌మెంట్‌లు, కార్యాలయాల్లో పనులు గురించి, టూర్‌ల గురించి రాస్తుంటారు. కాగా గృహిణిలు సైతం తమ నివాస గృహాల్లో సమాచారాలతో పాటు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ రకాల చెల్లింపులు నమోదు చేయడం కనిపిస్తుంటుంది. వీటి ద్వారా అనేక విషయాలు గుర్తు పెట్టుకోవడం, విధులు, బాధ్యతల్లో మంచి స్నేహితునిగా డైరీ తోడ్పడుతుంది. ఉరుకులు, పరుగులతో పెనవేసుకున్న నేటి కాలంలో టాస్క్‌లు గుర్తుచేసే ప్రక్రియగా డైరీ రాసే ప్రాధాన్యం బాధ్యతగా మారిందనడం అతిశోయక్తికాదు. కాలానుగుణంగ డైరీ సైతం అనేక మార్పులకు గురవుతుంది. ఆత్మ పరిశీలనగా.. దైనందిన ప్రక్రియగా రాస్తున్న డైరీకి దీటుగా డిజిటల్ డైరీ ప్రాముఖ్యత పెరిగింది. దీనిలో సైతం తమ జ్ఞాపకాలు, అనుభూతులు, ఈవెంట్ల సమాచారం రికార్డు చేస్తున్నారు. అంతేకాక డిజిటల్ డైరీ ఇతరులు చూసే అవకాశం ఉండదు. ప్రత్యేకంగా పాస్‌వర్డ్ ఏర్పాటు చేసుకోవడం మూలంగా సంబంధి వ్యక్తి మినహా ఇతరులు చూడలేక,

డిప్రెషన్ తొలగించే మానస చికిత్స..

నేటి కాలంలో అనేక మంది తీవ్రమైన డిప్రెషన్‌కు గురికావడం, అనారోగ్యాల భారిన పడుతున్న వారికి వంటరిగా బావిస్తున్న వారికి డైరీ ప్రియనేస్తంగా మారింది. డిప్రెషన్‌కు గురైన వ్యక్తులు తమలోని భావాలను వ్యక్తపరచడం ద్వారా నిరాష బావాలను తగ్గించడంలో డైరీ రాసే అలవాటు తోడ్పడుతుందని వైద్యులు సూచిస్తున్నారు. డిప్రెషన్‌లో ఉన్నవారి మనస్సులో ఏం జరుగుతుందో.. వారిలో సంఘర్షించే అంశాలు ఏమిటో గుర్తించటానికి తమ నిరుత్సాహాలను దూరం చేసే అంశాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశం ఉండటంతో వారికి సాంత్వన లభించే అవకాశం ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. అంతేకాక డైరీ రాయడం ద్వారా వారి మానసిక స్థితిని పరిశీలించి వారికి సానుకూల పరిస్థితులు నెలకొల్పడానికి సైతం డైరీ ప్రేరణగా నిలుస్తుందని పేర్కొంటున్నారు.

సారూ.. ఆదుకోండి..

- సదరమ్ పత్రం కోసం పడరాని పాట్లు
- సాట్లు తగ్గించడంతో ఇబ్బంది
- పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని ఓ దివ్యాంగుడి వేడుకోలు



భార్య నాగేంద్రతో, దివ్యాంగుడు సీతారాములు

సుజాతనగర్, డిసెంబరు 31: సుజాతనగర్ మండలం నాయకులగూడెం గ్రామానికి చెందిన చల్లా సీతారాములు భార్య నాగేంద్రతో కలిసి కూలీనాలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెక్కాడితేగాని డొక్కాడని వారి కుటుంబంలో ఆరు నెలల క్రితం జరిగిన సంఘటన వారి కుటుంబాన్ని కష్టాలోకి నెట్టివేసింది. సీతారాములుకు గతంలో 20 ఏళ్ల క్రితం ఎప్పుడో కాలుకు గుచ్చుకున్న ఇనుప మేకు కారణంగా ఇన్‌ఫెక్షన్ అయింది. షుగర్ కంట్రోల్ కాకపోవడంతో ఆరు నెలల క్రితం వైద్యులు అతడి కుడి కాలుని పాదం వరకు తొలగించారు. దీంతో సంపాదించి కూడబెట్టుకున్నదంతా హరించుకుపోయింది. కాగా ఆరు నెలలుగా దివ్యాంగుడి సదరన్ సర్టిఫికేషన్ కోసం మీ సేవల చుట్టూ తిరుగుతున్నా ఆన్‌లైన్ చేయించుకోలేకపోతున్నాడు. ప్రభుత్వం స్లాట్ బుకింగ్ తగ్గించి వేయడంతో, ఇప్పుడు జిల్లా మొత్తం 30 మందికే స్లాట్ బుక్ అవుతుండటం శాపంగా మారింది. తెలంగాణ ప్రభుత్వంలోని టీఆర్ఎస్ పాలనలో స్లాట్ బుకింగ్ కోసం ఉన్న ఒక్క కాలితో తిరిగినా కాలేదని, ఇప్పుడు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సదరమ్ సర్టిఫికేట్ ఇస్తుందో లేదో అని ఆందోళన చెందుతున్నాడు. తెచ్చిన అప్పులు తీర్చలేక, బతుకు బండి లాగలేక నానా యాతన పడుతున్నాడు. భార్య కూలీ మీదనే పొట్టపోసుకుంటున్న తనకు కొత్త ప్రభుత్వంలలో అయినా అభయహస్తం పథకంలో పెన్షన్‌కి దరఖాస్తు చేయడానికి సదరమ్ ధ్రువీకరణ లేకపాయె అంటూ కళ్లనీళ్ల పర్యంతం అయ్యాడు. అధికారులు స్పందించి సీతారాములును ఆదుకోవాలని ప్రజలు కోరతున్నారు.

కాంగ్రెస్‌లోకి చేరిన ఆలయ కమిటీ చైర్మన్

ఇల్లందు టౌన్, డిసెంబరు 31: ఇల్లెందు పట్టణంలోని జేకే కాలనీలో గల హరిహర క్షేత్రం ఆలయ కమిటీ చైర్మన్ ఎల్.క్రిష్ణ ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజారంజక పాలన సాగుతోందని హర్షం వెల్లుబుచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని, వివిధ పార్టీల నాయకులు సైతం కాంగ్రెస్‌లో చేరుతున్నారని వివరించారు. ప్రజల పక్షాన్నే కాంగ్రెస్ నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలందరిక సంక్షేమ పథకాలు అందించాలన్నదే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో రాపత్తు సేవ


రాపత్తు సేవ నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, డిసెంబరు 31: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం రాపత్త్సోత్సవం బ్రిడ్జి రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలోని రామదూత మండపంలో నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాపత్తు సేవలో రామానుజ జీయర్ స్వామి పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుదర్శన్‌రావు, డాక్టర్ జయభారతి, డాక్టర్ మహిత్‌తో పాటు దేవస్థానం వైదిక సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా భద్రాచలంలోని రామాలయంలో ఆదివారం ఆర్జిత సేవల్లో భాగంగా నిర్వహించిన స్వర్ణ పుష్పార్చన నిత్యకల్యాణాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిత్యకల్యాణాల్లో 83 జంటలు పాల్గొన్నాయి. కాగా దేవస్థానం నిత్యాన్నదాన పథకంకు ఏపీలోని బాపట్ల జిల్లా చీరాలకు చెందిన సూర్యకుమారి రూ.1,01,116లు అందజేశారు. ఫైర్ స్టేషన్ రోడ్డులో ఏర్పాటుచేసిన భగవద్ రామానుజ విగ్రహాన్ని జీయర్ స్వామి ప్రారంభించారు.

క్రీడలతో రాష్ట్రానికి వన్నె తేవాలి: కోరం

ఇల్లందు, డిసెంబర్ 31: విద్యతో పాటు క్రీడల్లో తెలంగాణ రాష్ట్రానికి వన్నె తేవాలని, జాతీయస్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. నాలుగు రోజులుగా ఇల్లందులో జరుగుతున్న ఏడవ రాష్ట్ర స్థాయి గిరిజన కళాశాలల బాలికల క్రీడోత్సవాలు ముగిసాయి. ఆదివారం రాత్రి జరిగిన బహుమతి ప్రధాన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం మాట్లాడుతూ ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలు ప్రోత్సహిస్తుందన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే వారికి ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ అరుణకుమారి, రెసిడెన్షియల్ కళాశాల సొసైటీ అధికారులు పాల్గొన్నారు.

గిరిజన క్రీడల్లో భద్రాద్రి అగ్రస్థానం


బహుతినందజేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

భద్రాచలం, డిసెంబరు 31: ఇల్లెందులో 28 నుంచి 31 వరకు నిర్వహించిన ఏడో రాష్ట్రస్థాయి తెలంగాణ గిరిజన గురుకుల క్రీడా పోటీల్లో భద్రాచలం గిరిజన గురుకులం విద్యార్థినులు తమ సత్తా చాటి అన్ని క్రీడాంశాల్లో అగ్రస్థానం సాధించి మెగా ఛాంపియన్‌షిప్‌తో పాటు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ పొందారు. అండర్ -17 అథ్లెటిక్స్ విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్, అండర్-19 విభాగంలో వాలీబాల్, కబడ్డీ పోటీల్లో విన్నర్స్‌గా నిలిచారు. అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల రిలే రన్‌లో శ్రీతేజ ప్రథమస్థానం సాధించారు. అండర్-19 చెస్‌లో ధనుశ్రీ విన్నర్స్‌గా నిలిచింది. అండర్-14లో వాలీబాల్ ద్వితీయ స్థానం, చెస్‌లో శ్రీజ ప్రథమస్థానం, అండర్ 14, 17 విభాగం ఆర్చరీలో సుహిత, మానస, అక్షిత, శ్వేత గ్రూప్‌కు ప్రథమస్థానం లభించింది. అండర్-14 ఆర్చరీలో మేఘన వైష్ణవి కీర్తిక గ్రూప్‌కు ద్వితీయ, తృతీయ స్థానం లభించింది. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో విజయబావుట ఎగురవేసిన భద్రాచలం గిరిజన గురుకుల బాలికలను ప్రిన్సిపాల్ ఎం.దేవదాసు అభినందించారు. తమ గురుకులానికి ఇన్ని బహుమతులు లభించడం ఆనందకరంగా ఉందన్నారు.

జారేను కలిసిన పలువురు నాయకులు


సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణ నాయకులు

అశ్వారావుపేట, డిసెంబరు 31: అశ్వారావుపేట మండలానికి చెందిన పలువురు పేట మండలానికి చెందిన నాయకులు, విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యే జారే ఆదినారాయణను ఆదివారం ఆయన నివాసగృహంలో కలిసి అభినందనలు తెలిపారు. శాలువ కప్పి సన్మానం చేసారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జారే ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజలు ఏ పనివున్న నేరుగ తనను కలవవచ్చునని, మీ అందరి క్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తానన్నారు.

ఎమ్మెల్యే కూనంనేనికి ఘన సన్మానం


సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణ నాయకులు

పాల్వంచ టౌన్, డిసెంబరు 31: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఆదివారం మార్కెట్‌ఏరియాలో పలువురు ప్రముఖులు, కాంట్రాక్టర్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీవీ.రావు, బొడేపూలి చిన్ని, టీడీపీ నాయకులు కనగాల అనంతరాములు, నల్లమల వేణు, ఎస్ఎ. రెహమాన్, సంక్రాంతి రవి, దారా కరుణాకర్, మేదరమెట్ల నారాయణ, చంద్ర రవి, ఎలక్ట్రీకల్ చలపతిరావు, పలువురు వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు

జూలూరుపాడు, డిసెంబరు 31: రైతులు మిరప సాగులో సస్య రక్షణ చర్యలను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని సాగర్ సీడ్స్ కంపెనీ ప్రతినిధులు పి.శ్రీనివాసరెడ్డి, వి.మురళీలు తెలిపారు. ఆదివారం మండలంలోని గాంధీనగర్ గ్రామంలో సీతారామ ట్రేడర్స్ వారి ఆధ్వర్యంలో భూక్యా రాజేష్ రైతు మిర్చి తోటలో క్షేత్ర ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా సస్య రక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు శాలువలు కప్పి సన్మానం చేశారు. ఈ క్షేత్ర ప్రదర్శనలో వివిధ మండలాలకు చెందిన మంది రైతులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ, బాలాజీ పాల్గొన్నారు.

'నూతన' వేడుకలకు సర్వం సిద్ధం

కేకులు, స్వీట్ల దుకాణాల వద్ద సందడే.. సందడి

కొత్తగూడెం సాంస్కృతికం, డిసెంబరు 31: నూతన సంవత్సర స్వాగతానికి సర్వం సిద్ధమైంది. స్వీట్లు, కేకుల కొనుగోళ్లకు భారీగా ప్రజలు పోటెత్తారు. కొత్తగూడెం సమీప ప్రాంతాల్లో నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు ఆదివారం వివిధ ప్రాంతాల్లో ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా నూతన సంవత్సర సందర్భంగా కేకులు కొనుగోలు చేసేందుకు బేకరీల వద్ద ప్రజలు బారులు తీరారు. వస్త్ర, పూలు, స్వీట్ల దుకాణాల వద్ద జనం సందడి చేశారు.

పేటలో నూతన సంవత్సర కోలాహలం

అశ్వారావుపేట రూరల్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అశ్వారావుపేటలో ఆదివారం ఉదయం నుంచి కోలాహలం నెలకొంది. రంగులు అమ్మే దుకాణాలు, వస్త్రాలయాలు, మిఠాయి దుకాణాలు, పండ్ల దుకాణాలు ఇలా అన్ని రకాల దుకాణాలు కొనుగోలుదారులతో కోలాహలంగా మారాయి. ఇళ్ల ముందు రకరకాల ముగ్గులను వేశారు. నూతనసంవత్సరం సందర్భంగా పలుచోట్ల యువకులు పార్టీలను ఏర్పాటు చేసుకున్నారు. నూతన సంవత్సరం వేళ చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, యువకులు జూలూరుపాడులో కేక్‌లు, రంగులను కొనుగోలు చేశారు. దీంతో సందడి నెలకొంది. చర్చీలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పోలీసుల ప్రత్యేక డ్రైవ్

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలో డిసెంబర్ 31న పురస్కరించుకుని సీఐ రమాకాంత్ ఆదివారం పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా సాయంత్ర 7 గంటల నుంచి డ్రంకెన్ డ్రైవ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ప్రత్యేక ఆంక్షలను విధించారు. రోడ్లపై కేక్‌లు కట్ చేయరాదని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. డ్రంక్ డ్రైవ్‌లో పట్టు బడితే రూ.10 వేల జరిమాన, ఆరు నెలల జైలు శిక్ష పడతుందని హెచ్చరించడంతో పాటు సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ఎస్ఐలు రాజేష్, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందు: ఇల్లందులో నూతన సంవత్సర స్వాగత వేడుకలు ఆదివారం రాత్రి ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. విందులు, వినోదాలతో 2023కు వీడ్కోలు.. 2024కు స్వాగతం పలుకుతూ వేడుకలు నిర్వహించారు. మహిళలు రంగవల్లులు వేశారు బస్తీలు, సింగరేణి కాలనీల్లో యువకులు, మహిళలు కేకులు కట్ చేశారు మద్యం, మాంసం విక్రయాలు జోరుగా సాగాయి. యువకులు జట్లు జట్లుగా హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేరింతలు కొట్టారు...


అశ్వారావుపేటలో కేకులు కొనుగోళ్లు


మణుగూరులో డ్రంకెన్ డ్రైవ్

కనులపండువగా రామతీర్థ శోభాయాత్ర


అశ్వారావుపేటలో శోభాయాత్ర


పాల్వంచలో నిర్వహించిన శోభాయాత్ర

అశ్వారావుపేట, డిసెంబరు 31: అశ్వారావుపేటలో ఆదివారం వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వేదికగ ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ సంయుక్తంగా చేపట్టిన రామతీర్థ శోభాయాత్ర, కలశ పూజలు అత్యంత వైభవంగా కనులపండుగల జరిగాయి. మండల పరిధిలోని 75 గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఉదయం 9గం.లకు అయోధ్య నుండి వచ్చిన అక్షింతలను కలశంలో ఉంచి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వందలాది మందితో సామూహిక కలశ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు రవి కుమార్ మాట్లాడుతూ జనవరి 1వ తేదీకల్లా అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు కలశంలో ఉంచి ప్రతి గ్రామానికి వెళుతుందని, వీటిని ఆయా గ్రామాలలో ప్రతి ఇంటికి పంపించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. అనంతరం సీతారామ లక్ష్మణ హనుమాన్ విగ్రహాలను పల్లకిలో ఉంచి పట్టణంలో శోభాయాత్రను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలోని 75 గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పట్టణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్యక్రమంలో ధర్మ జాగరణ జిల్లా అధ్యక్షులు చవ్వా రమేష్, అశ్వారావుపేట ఖండ కార్యకర్త జి అప్పారావు, శేషుబాబు, భౌతిక్ ప్రముఖ్ నల్లపు శివకుమార్ తదితదరులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల నుండి వచ్చిన భక్తులకు కలశంలో అక్షింతలు ఉంచి గ్రామాలకు పంపారు.

పాల్వంచలో అయోధ్య అక్షింతల శోభాయాత్ర

పాల్వంచ టౌన్: అయోధ్య శ్రీరాముని పూజించిన అక్షింతలతో పాల్వంచ పురవీధుల్లో ఆర్ఎస్ఎస్ విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. మొదటగా ఆర్ఎస్ఎస్ కార్యవాహ మేదరమెట్ల పార్థసారథి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గుడిదేవి వెంకటేశ్వర్లు, వింజమూరి మురళీ కృష్ణమాచార్యులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే

జూలూరుపాడు, డిసెంబరు 31: రాష్ట్రంలో ఇందిరమ్మ పాలనలో అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలను అందిస్తామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. ఆదివారం జూలూరుపాడులో ఆయనకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే దానిలో భాగంగా ఇప్పటికే ప్రజా పాలన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టి గ్రామాలలో గ్రామ సభలను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ప్రజలు తనను గెలిపించారని వారికి రుణపడి ఉంటానని అన్నారు. గ్రామాలలో సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, ఎంపిటీసీ దుద్దుకూరి మధుసుధన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్, నాయకులు ముక్తిన్ని రామయ్య, వేల్పుల నరసింహారావు, పి.నాగరాజు, కిరణ్, మాదుగుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ..

జూలూరుపాడు, సాయిరాంతండా గ్రామాలలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. జూలూరుపాడులో అనారోగ్యంతో యల్లంకి నారాయణ మృతి చెందగా ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. సాయిరాం తండాలో హళావత్ చాప్లీ ఇటీవల మృతి చెందగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.


జూలూరుపాడులో ఎమ్మెల్యేకు సన్మానం

ఓటమికి పనిచేసిన వారిని దగ్గరికి రానివ్వను: పాయం

బూర్గంపాడు, డిసెంబర్ 31: బూర్గంపాడు మండల పరిధిలోని మోతె సమ్మక్క సారలమ్మ ఆలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్, మిత్రపక్షాల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువలతో సత్కారించి పుష్పగుచ్చాలు అందజేశారు. ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో గెలిపించిన నాయకులు, కార్యకర్తల కృషి మరువలేనిదన్నారు. పార్టీ ఓటమి కోసం పని చేసిన ఏ ఒక్కరిని దగ్గరకు రానివ్వనని.. మీరు కూడా వారిని తీసుకరావద్దన్నారు. పార్టీ గెలుపునకు కృషి చేసిన వారికి ఉన్నత విలువలను కల్పిస్తామని భరోసా కల్పించారు. జరగనున్న ఎన్నికల్లో ఇదే విధమైన మెజారిటీ సాధించేలా ప్రతి ఒక్కరు శక్తి వంచన లేకుండా కృషి చేయలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తూళ్లూరి బ్రహ్మయ్య, నాయకులు కృష్ణారెడ్డి, రంగారావు, హరిప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మహబూబాబాద్ నాయకులు

ఎమ్మెల్యేకు సన్మానం

మణుగూరుటౌన్: మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ ఆశావాహి, ఆదివాసీ సంఘాల జేఏసీ కన్వీనర్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికితే జైలుకే

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటరు, డిసెంబరు 31: కొత్తగూడెం పరిధిలోని ప్రజలందరికి ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో కె.నరేష్ నూతన సంవత్సర శుభకాంక్షలు ఆదివారం తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, యువత వేడుకలు శాంతియుత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ జరుపుకోవాలని సూచించారు. సోమవారం సాయంత్రం 6గంటల నుంచి స్పెషల్ డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిపై కేసులు నమోదు చేసి బైయిండోవర్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మద్యానికి దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్త, పర్యవేక్షణ ఉండాలని, అందరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు నూతన సంవత్సర వేడుకలను ప్రజలు, యువత శాంతి భద్రతలకు విఘాతం కలగకుండ కుటుంబసమేతంగా తమ ఇళ్లల్లో సంతోషంగా, చట్టబద్ధంగా నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు.

నేటి గిరిజన దర్బారు రద్దు: పీవో

భద్రాచలం, డిసెంబరు 31 సోమవారం ప్రభుత్వ సెలవుదినం అయినందున ఐటీడీఏ కార్యాలయంలో జరగవలసిన గిరిజన దర్బారును రద్దు చేస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ తెలిపారు. అలాగే ఏజెన్సీ ఏరియాలో పని చేస్తున్న ఉద్యోగులు, ఆదివాసీ గిరిజన కుటుంబాలకు, గిరిజన విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలను పీవో తెలిపారు. ప్రతి ఒక్కరు 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికి 2024 సంవత్సరానికి స్వాగతం పలకాలని కొత్త ఆశలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని కోరారు.

రక్షణ చర్యలపై ఓబీ కంపెనీల నిర్లక్ష్యం

మణుగూరుటౌన్, డిసెంబరు 31: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓబీ కంపెనీలు కార్మికుల రక్షణ చర్యలపై నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తున్నాయని ఏఐటీయుసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏరియాలోని పీకేఓసీ-2 ఓబీ కంపెనీలో డిసెంబర్ 29న శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఓబీని తరలించే సానియా వాహనం ప్రమాదానికి గురైందని, ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలవ్వడంతోపాటు వాహనానికి కూడా భారీ నష్టమే జరిగిందన్నారు. ఈ ఘటనలో గాయపడిన సానియా ఆపరేటర్‌ను సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించకుండా రాత్రిరాత్రే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించడంలో ఓబీ కంపెనీ యాజమాన్యం ద్వేవ్యమేంటని ప్రశ్నించారు. ప్రమాదానికి గల కారాణాలు వెంటనే సింగరేణి యాజమాన్యం విశ్లేషించాలని, రక్షణ నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్న ఓబీ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నాయకులకు సన్మానం

చుంచుపల్లి, డిసెంబరు 31: ఇటీవల సింగరేణి సంస్థలో నిర్వహించిన గుర్తింపు సంఘం ఎన్నికల ఫలితాల్లో ఐఎన్‌టీయూసీ ఘన విజయం సాధించడం పట్ల జిల్లా కాంగ్రెస్ నాయకులను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఆదివారం విద్యానగర్‌కాలనీలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమం సింగరేణి కార్మికుడు, కాంగ్రెస్ ఐఎన్‌టీయూసీ నాయకులు, రుద్రంపూర్ రజాక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ నాయకుల సమన్వయంతోనే గెలుపు సాధ్యపడిందన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర రెవిన్యూ, సమాచార, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తూ తమ వెన్నంటే ఉండి ప్రోత్సహించారని గుర్తు చేశారు. మంత్రి పొంగులేటి ప్రోత్సాహంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏరియాలో ఐఎన్‌టీయూసీ సంఘాన్ని గెలిపించుకున్నామన్నారు. రానున్న రోజుల్లో కూడా సింగరేణి కార్మికసంఘం ఐఎన్‌టీయూసీ మరింత బలోపేతం చేయడానికి పని చేయాలని, సింగరేణి సంస్థ అభివృద్ధి చెందే విధంగా ప్రతి కార్మికుడు కష్టపడి పని చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త బొగ్గుబావులు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి సింగరేణి కార్మికుడికి ఐఎన్‌టీయూసీ నాయకులు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం ఈ గెలుపులో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము చౌదరి, ఆళ్ల మురళీర డాక్టర్ శంకర్ నాయక్, నాగేంద్ర త్రివేది, పెద్దబాబు సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలక రాజయ్య, భీముడు, నాగరాజు, గౌస్, సత్తార్, మోహన్ రెడ్డి, విప్లవరెడ్డి, నటరాజ్, జెల్లి కిరణ్, గోపీ, నాగిరెడ్డి పాల్గొన్నారు.

కాళ్లూరి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

అన్నపురెడ్డిపల్లి, డిసెంబరు 31: అన్నపురెడ్డిపల్లిలోని కాళ్లూరి సీతారామ రుక్మాధరరావు(80) మృతిపట్ల అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆదివారం ఆయన కాళ్లూరి మృతదేహానికి పూల మాలవేసి నివాళులు అర్పిచారు. ఎమ్మెల్యే వెంట నాయకులు పర్సా వెంకటేశ్వరరావు, వనమా గాంధీ, గోళ్ల ముత్తయ్య, భీముడు, తదితరులు ఉన్నారు.

రామాలయంలో ఘనంగా ధనుర్మాస సేవ

పాల్వంచ టౌన్, డిసెంబరు 31: పట్టణంలోని శాస్త్రీ రోడ్డు భజనమందిర రామాలయంలో స్వామివారికి ధనుర్మాసోత్సవ సేవలు ఘనంగా జరుగుతున్నాయి. దానిలో భాగంగా ఆదివారం నాయగనాయ పాశురము సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు గోపాల కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రజనికుమారి, మాజీ ధర్మకర్త చలువాది ప్రకాష్, ఆలయ సిబ్బంది కాశీ, శివ, నర్సమ్మ, భక్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, పిల్లలకు దుస్తుల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ములకలపల్లి, డిసెంబరు 31: ములకలపల్లి మండల తాళ్లపాయి గ్రామ పంచాయతీలో గొత్తికోయల నివాస ప్రాంతంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ పాల్వంచ కిన్నెరసాని ఆధ్వర్యంలో నిరుపేదలైన గొత్తికోయలకు, వారి పిల్లలకు ఉచితంగా ఆదివారం దుప్పట్లు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు లయన్ ఆర్. కేదారేశ్వరరావు మాట్లాడుతూ ఆదివాసీలైన గొత్తికోయలు అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్నారని వృద్ధులు, పిల్లలు వారు చలితీవ్రతతో బాధపడుతున్నారన్నారు. వారికి తమవంతుగా 20మంది వృద్ధులకు దుప్పట్లు, 16మంది గొత్తికోయల పిల్లలకు బట్టలు పంపిణీ చేశారు. బాధితులు నిరాశ్రయులైన వారిని ఆదుకోవడమే లయనిజమన్నరు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ లయన్ రేపాక ప్రసాద్‌రావు, క్లబ్ సభ్యులు లయన్ తిరుపతిరెడ్డి, శ్రీనివాసరావు, డాక్టర్ సత్యనారాయణ రాజు, రాజు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధంపై తీర్మానం

పాల్వంచ, డిసెంబరు 31: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం దంతెలబోర ఎస్సీ కాలనీలో మద్యపాన నిషేదంపై పంచాయతీ తీర్మానం చేశారు. ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్న గ్రామ పాలక సభ్యులు మద్యపానాన్ని పంచాయతీలో నిషేదించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గద్దల రమేష్ మాట్లాడుతూ మద్యపానం వల్ల ఎన్నో కుటుంబాలు నాశనం అయ్యాయని, మద్యం సేవించి యువత తప్పుడు మార్గాల్లో పయనిస్తున్నారని, ఆ క్రమంలోనే వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మద్యపానాన్ని నిషేధించడానికి తీర్మానించామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజశేఖర్, ఉప సర్పంచ్ వెంకటనర్సమ్మ, ఆదిలక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.